www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 7 మార్చి 2025

5

కాకినాడ

నేటి నుంచి సిపిఎం ప్రజా చైతన్యయాత్ర

ప్రజాశక్తి - కాకినాడ

ప్రజా సమస్యల పరిష్కార కోసం సిపిఎం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించ తలపెట్టిన ప్రజా చైతన్య యాత్ర ఈ నెల 7వ తేదీన ప్రారంభం కానుందని సిపిఎం .జిల్లా కార్యదర్శి కరణం ప్రసాదరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 7వ తేదీ ఉదయం 8 గంటలకు నగరంలోని సుందరయ్య భవన్ నుంచి ప్రారంభమయ్యే సైకిల్ యాత్రలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి సమస్యలను తెలుసుకుంటారని తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో పాదయాత్రలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. పార్టీ నాయకులు, సభ్యులు ఈ సైకిల్ యాత్రలో పాల్గొని జయప్రదం చేయాలని అయన కోరారు.

అసౌకర్యాల నడుమ ఉపాధి

- పని ప్రదేశంలో కరువైన వసతులు
- మండుతున్న ఎండలు
- కనిపించని టెంట్లు, ప్రథమ చికిత్స కిట్లు
- 10 వారాలుగా వేతనాలు పెండింగ్

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అసౌకర్యాల చెరలో నడుస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు కావస్తున్నా ఉపాధి కూలీల సమస్యలను పట్టించుకోవడం లేదు. గత వైసిపి ప్రభుత్వ పాలనలో కూలీలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలోనూ అదే పరిస్థితులను ఎదుర్కొంటున్నామని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాకినాడ జిల్లాలో 20 మండలాల్లో 385 గ్రామ పంచాయతీలుండగా 2.74 లక్షల జాబ్ కార్డుల పరిధిలో 4.48 లక్షల మంది కూలీలున్నారు. వీరిలో రెగ్యులర్ గా 3.15 లక్షల మంది పని చేస్తున్నారు. ప్రస్తుతం రెండు నెలలుగా 20 నుంచి 26 వేల మంది మాత్రమే పని చేస్తున్నారు. ఇదిలావుండగా గత 20 రోజులుగా ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరిగిపోయాయి. ఈ నేపథ్యంలో పని ప్రదేశంలో సౌకర్యాల లేమీతో తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నామని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పని చేస్తున్న క్రమంలో మధ్య మధ్యలో సేద తీరేందుకు ప్రభుత్వం టెంట్లను ఏర్పాటు చేయాల్సి ఉంది. అలాగే ఏదైనా ప్రమాదం జరిగితే వెంటనే చికిత్స చేసుకునేందుకు ప్రథమ చికిత్స కిట్లను కూడా అందుబాటులో ఉంచాల్సి ఉన్నా ప్రభుత్వం ఆ దిశగా ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. అలాగే వడదెబ్బ నుంచి రక్షణ పొందేందుకు తాగునీరు, మజ్జిగ, ఒఆర్ఎస్ ప్యాకెట్లు వంటివి గతంలో కూలీలకు అందించేవారు. కానీ గత కొన్ని నెలల నుంచి వీటిని అందించడం లేదు.

తాగునీటిని కూలీలు ఎవరికి వారు ఇళ్ల వద్ద నుంచే తెచ్చుకుంటున్నారు. ఒకటి నుంచి రెండు లీటర్లు తెచ్చుకుంటున్నప్పటికీ మండుతున్న ఎండలకు అవి ఏమాత్రం సరిపోవటం లేదు. దీంతో తాగేందుకు గుక్కెడు నీళ్లు లేక పని ప్రదేశంలో అల్లాడిపోతున్న పరిస్థితులు కన్పిస్తున్నాయి. ప్రభుత్వం టెంట్లలను పంపిణీ చేయకపోవడంతో మండుతున్న ఎండలకు సేద తీరేందుకు సుదూర ప్రాంతాల్లో ఉన్న చెట్ల కిందకు వెళ్లాల్సి వస్తుంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం కూలీలకు ఇచ్చిన కొలతల మేరకు పనిచేయాల్సి ఉంది. దీంతో క్షేత్రస్థాయిలో పనులు చేయాలంటే తీవ్ర ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తోంది. అలాగే ఎండల్లో పని చేస్తున్నందుకు 10 నుంచి 20 శాతం అలవెన్సులు కూడా అందడం లేదు. పనిముట్లు కూడా ఇవ్వకపోవడంతో కూలీలు తీవ్ర అవస్థలు పడాల్సి వస్తుంది. ఇలా కనీస వసతులు కల్పించకపోవడంతో ఉపాధి పనులకు వెళ్లాలంటేనే కూలీలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ఉపాధి పథకం పనులపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్న కూలీలు పనులకు వెళ్లాలంటే గగ్గోలు పెట్టే పరిస్థితి ఏర్పడింది.

రూ.12 కోట్లుపైనే బకాయిలు

ఒక్కొక్కరికి 10 వారాలుగా వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రస్తుతం రోజుకి సుమారు 26 వేల మంది కూలీలు పనులకు వెళుతున్నారు. వీరందరికీ డిసెంబర్ 18 తర్వాత నుంచి ప్రభుత్వం వేతనాలు ఇవ్వడం లేదు. ఒక కూలీ 6 రోజులూ పనికి వెళితే రోజుకి రూ.270-280 చొప్పున వారానికి రూ.1,680 వస్తుంది. ఇలా జిల్లాలో ఒక్కొక్కరికి రూ.12 వేలు నుంచి రూ.15 వేలు వరకూ వేత నాలు అందాల్సి ఉంది. ఇలా జిల్లా వ్యాప్తంగా ఉన్న 26 వేల మందికి రూ.12.5 కోట్లు పైనే వేతన బకాయిలు ఉన్నట్లు అధికారులు తెలిపారు.

సౌకర్యాలు కల్పించాలి

పని ప్రదేశంలో ఎటువంటి సౌకర్యాలు లేవు. చాలా ఇబ్బందులు పడుతున్నాం. ఎండలు ఇప్పటికే ముదురి పోయాయి. టెంట్లు, తాగునీటి సౌకర్యం కల్పించాలి. అలాగే ప్రథమ చికిత్స కిట్లను కూడా ప్రభుత్వం తక్షణమే ఏర్పాటు చేయాలి.

–ఎద్దు వీర నాగేశ్వరరావు, ఉపాధి కూలీ, మల్లం, పిఠాపురం మండలం

అప్పులతోనే కుటుంబ పోషణ

ప్రభుత్వం 10 వారాలుగా వేతనాలు పెండింగ్లో ఉంచింది. ఉపాధి పనులపైన ఆధారపడి కుటుంబాలను పోషించుకోవాలి. జీతాలు ఇవ్వకపోవడంతో అప్పులతో కుటుంబాలను పోషించుకుంటున్నాం. తక్షణమే కూటమి సర్కారు స్పందించి పెండింగ్ వేతనాలను విడుదల చేయాలి.

ఎం. ఏసుబాబు, ఉపాధి కూలీ, మల్లం, పిఠాపురం మండలం.

కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న ఆశా కార్యకర్తలు

నిర్బంధంపై ఆశాల ఆగ్రహం

- కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి - కాకినాడ

ఆశ కార్యకర్తలకు కనీస వేతనాలు చెల్లించాలని, పని భారం తగ్గించాలని కోరుతూ ఎపి ఆశ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన చలో విజయవాడ ఉద్రిక్తతలకు దారితీసింది. రైళ్ల నుంచి, బస్సుల నుంచి టికెట్లు కొనుగోలు చేసి వెళ్తున్న ఆశా కార్యకర్తలను పోలీసులు బలవంతంగా అదుపులోకి తీసుకుని నిర్బంధించారు. ఈ నిర్బంధానికి వ్యతిరేకంగా కలెక్టరేట్ వద్ద ఆశ కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపి ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షురాలు జి.బేబీరాణి, సిఐటియు జిల్లా అధ్యక్షులు దువ్వ శేషబాబ్జి మాట్లాడుతూ ఆశ కార్యకర్తలకు గత ఆరేళ్ల నుంచి వేతనాలు పెంచలేదని, ఇదే సందర్భంలో నిత్యావసర సరుకుల ధరలు కొన్ని వందల శాతం పెరిగితున్నాయని అన్నారు. చాలీచాలని వేతనాలతో కుటుంబాలతో ఎలా బ్రతకాలని ప్రశ్నించారు. తక్షణం పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఆశ కార్యకర్తలకు కనీస వేతనాలు రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఆశ కార్యకర్తల శాంతియుత ఆందోళనలను విచ్చిన్నం చేయడానికే చర్చలు జరుపుతున్నట్లు నటిస్తుందని విమర్శించారు. ప్రభుత్వం అంగీకరించిన మినిట్స్ మేరకు గ్రాడ్యుటీ, మేటర్నిటీ లీవ్, ఉద్యోగ విరమణ కాలపరిమితి జిఒలను తక్షణం విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్‌కుమార్, ఆశ వర్కర్స్ యూనియన్ నాయకులు పాప, మణి, సత్యవతి, ధనలక్ష్మి, కృపారాణి, పాపయమ్మ తదితరులు పాల్గొన్నారు

సకాలంలో పనులు పూర్తి చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి - పిఠాపురం

అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్

స్థానిక మున్సిపల్ అతిథిగృహంలో తాత్కాలికంగా ఏర్పాటు చేస్తున్న పిఠాపురం ఏరియా డెవలప్‌మెర్ అథారిటీ(పాడా) కార్యాలయ పనులను సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి ఆదేశించారు. గురువారం అధికారులతో కలిసి జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ పిఠాపురం పరిధిలోని ప్రాంతాల అభివృద్ధి చేసే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పాడాను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిందన్నారు. పిఠాపురం, గొల్లప్రోలు, యు.కొత్తపల్లి మండలాల పరిధిలోని గ్రామాల్లో ప్రభుత్వ సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు పూర్తిస్థాయిలో అమలయ్యేలా ఈ వ్యవస్థను ఏర్పాటు చేసిందన్నారు. ఇందుకు ప్రత్యేక అధికారులను నియమించిందన్నారు. ఈ పర్యటనలో పాడా ఇన్‌ఛార్జ్ పీడీ ఎన్.శ్రీధర్‌బాబు, ఎపీడీ పి.వసంతమాధవి, మున్సిపల్ కమిషనర్ కనకారావు, ఇతర ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న సత్యప్రభ

వసతుల కల్పనకు కృషి

ప్రజాశక్తి - ఏలేశ్వరం

కనీస మౌలిక వసతులు అయిన విద్య, వైద్యం, రహదారుల నిర్మాణాలకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎంఎల్ఎ వరుపుల సత్యప్రభ అన్నారు. గురువారం రూ.4 కోట్లతో నిర్మించనున్న డిగ్రీ కళాశాల అదనపు తరగతి గదుల నిర్మాణానికి ఆమె శంకుస్థాపన చేశారు. అనంతరం ఏలేశ్వరంలో సిసి రోడ్లు, డ్రెయినేజ్‌లో పూడిక తీత పనులు, మెయిన్‌రోడ్‌లో హై పవర్ ఎల్ఇడి బల్బుల ఏర్పాటు పనులకు స్వీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసిపి పాలనలో నియోజక వర్గం అభివృద్ధిలో కుంటుపడిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సంక్షేమం తోపాటు, అభివృద్ధి పనులు ముమ్మరంగా ప్రారంభం అయ్యాయని అన్నారు. నియోజకవర్గ సమస్యలను ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లిన వెంటనే నిధులు కేటాయించి పనులు జరిపిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జ్ వరుపుల తమ్మయ్యబాబు, ఛైర్‌పర్సన్ అలమండ సత్యవతి, వార్డు కౌన్సిలర్లు బొదిరెడ్డి గోపి, మూది నారాయణ స్వామి, పింద్రాల శ్రీను, యండగుండి నాగబాబు, కోణాల వెంకటరమణ, మాజీ జడ్‌పిటిసి జ్యోతుల పెదబాబు, టిడిపి నాయకులు బుగత శ్రీను, మామిడి లలిత, అప్పారావు, జొన్నాడ వీరబాబు పాల్గొన్నారు.

పిఠాపురం ఇన్‌ఛార్జిగా పెండెం?

నేడు జనసేనలోకి దొరబాబు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

విలక్షణ తీర్పులకు నిలయమైన పిఠాపురం నియోజకవర్గంలో రాజకీయ పరిణామాలు వేగంగా చోటు చేసుకుంటున్నాయి. డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ నియోజకవర్గంలో రాజకీయాలు ఎప్పటికప్పుడు మారుతున్నాయి. మాజీ ఎంఎల్ఎ పెండెం దొరబాబు గతేడాది జూన్‌లో వైసిపికి రాజీనామా చేశారు. అప్పట్లో ఆయన జనసేన పార్టీలో చేరుతారనే ప్రచారం జరిగింది. అయితే 3 రోజుల క్రితం దొరబాబు తన కుటుంబ సభ్యులతో కలిసి డిప్యూటీ సిఎం, పిఠాపురం ఎంఎల్ఎ పవన్ కళ్యాణ్‌ను కలిశారు. ఈ నేపథ్యంలోనే శుక్రవారం తన అనుచరులతో కలిసి మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయన జనసేన తీర్థం తీసుకునేందుకు ముహూర్తాన్ని ఖరారు చేసుకున్నారు. గురువారం పిఠాపురంలోని దొరబాబు నివాసంలో కొందరు వైసిపి ప్రజాప్రతినిధులు, కార్యకర్తలతో ఆయన సమావేశమయ్యారు.

ఇన్‌ఛార్జ్ బాధ్యతలు

వైసిపికి రాజీనామా చేసినప్పటికీ పెండెం దొరబాబు పిఠాపురం నియోజకవర్గాన్ని అంటిపెట్టుకుని ఉంటున్నారు. నిత్యం తన అనుచరులతో టచ్‌లోనే ఉంటూ మంతనాలు సాగిస్తున్నారు. ఆయనతోపాటు జనసేనలోకి చేరే విధంగా కొంతకాలంగా వారిని సన్నద్ధం చేసుకుంటూ వచ్చారు. మెజార్టీ ప్రజల అభిప్రాయం మేరకే జనసేనలోకి చేరుతున్నట్లుగా ఆయన చెప్పుకుంటున్నారు. జనసేనలోకి చేరిన తర్వాత దొరబాబుకి నియోజకవర్గ బాధ్యతలు అప్పగించే ఆలోచనలో పవన్ కళ్యాణ్ ఉన్నట్లు ప్రచారం జరుగుతుంది. డిప్యూటీ సిఎంగా ఉన్న పవన్‌కళ్యాణ్ నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి సారించలేకపోతున్నాననే అసంతృప్తి ఆయనలో ఉంది. స్థానికంగా జనసేన నాయకులు ఉన్నప్పటికీ వారిలో సఖ్యత లేకపోవడంతో అనపర్తి నియోజకవర్గానికి చెందిన జనసేన నాయకుడు మర్రెడ్డి శ్రీనివాస్‌ను నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌గా నియమించారు. అయితే పార్టీ కార్యకర్తలను, నాయకులను ఆయన సమన్వయం చేయలేకపోతున్నారనే భావన స్థానిక నాయకత్వంలో వ్యక్తం అవుతోంది. ఈ నేపథ్యంలోనే పెండెంకు పిఠాపురం ఇన్‌ఛార్జ్‌గా నియమించాలనే ఆలోచనలో పవన్ ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. మరోవైపు ఇక్కడ టిడిపి ఇన్‌ఛార్జ్‌గా ఉన్న మాజీ ఎంఎల్ఎ వర్మ జనసేన పార్టీకి తలనొప్పిగా మారారు. కూటమి పార్టీలైనా టిడిపి, జనసేన మధ్య ఇక్కడ గ్యాప్ పెరుగుతోంది. ఖాళీ అవుతున్న ఐదు ఎంఎల్‌సి స్థానాల్లో ఒకటి తనకు కేటాయించాలని వర్మ గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. గోదావరి జిల్లాల నుంచి వర్మకు ఎంఎల్‌సి అవకాశ దక్కుతుందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. అదేజరిగితే పిఠాపురంలో మరో అధికార కేంద్రం ఏర్పాటు అయ్యే అవకాశం ఉంది. ఈ పరిణామాలతో వర్మకు చెక్ పెట్టేందుకు అధిష్టానం పెండెంకు ఇన్‌ఛార్జ్ బాధ్యతలు అప్పగించే అవకాశం ఉందని నియోజకవర్గంలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతుంది. ఇదే తరుణంలో దొరబాబును ఇన్‌ఛార్జ్ చేస్తే జనసేనలోని పాత, కొత్త నాయకుల మధ్య సమన్వయం తలెత్తే అవకాశాలు లేకపోలేదని పరిశీలకులు అంచనా వేస్తున్నారు.

నెలాఖరు లోగా పన్నులు చెల్లించాలి

ప్రజాశక్తి - సామర్లకోట

మున్సిపాలిటీకి చెల్లించవలసిన పన్నులను ప్రజలు ఈ నెలాఖరులోగా చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ అనిశెట్టి శ్రీవిద్య కోరారు. గురువారం ఆమె విలేకర్లతో మాట్లాడారు. మున్సిపాలిటీలో ఆస్తి పన్నుకు సంబంధించి చాలా బకాయిలు ఉన్నాయన్నాయన్నారు. గత ఏడాది కేవలం 65 శాతం మాత్రమే ఆస్తి పన్ను వసూలయ్యిందన్నారు. ఈ ఏడాది స్టేట్, సెంట్రల్‌కు చెందిన ఖాళీ స్థలాలు, వ్యక్తిగత ఆస్తి పన్నులకి సంబంధించి కేవలం 30శాతం మాత్రమే వసూలు చేయడం జరిగిందన్నారు. ఎక్కువ బకాయి ఉన్న సుమారు 350 గృహాలకు రెడ్ నోటీసులు జారీ చేశామన్నారు. పన్నులను సచివాలయాలు, మున్సిపల్ కార్యాలయం ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్‌లలో చెల్లించవచ్చునని తెలిపారు.

కష్టపడి పనిచేసే వారికి తగిన గుర్తింపు

ప్రజాశక్తి - గండేపల్లి

విధి నిర్వహణలో కష్టపడి పని చేసే వారికి తగిన గుర్తింపు ఉంటుందని ఎంపిడిఒ నాతి బుజ్జి అన్నారు, గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. మండలానికి ఇచ్చిన లక్ష్యం 5.38 లక్షల పనిదినాలు కాగా, 4,53,841 పనిదినాలు పూర్తియ్యాయని, మిగిలిన పనిదినాలను రాబోయే 20 రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. పనిదినాలు కల్పించడంలో జిల్లాలో మొదటి స్థానంలో ఉన్నప్పటికీ మరింతగా కృషి చేయాలన్నారు ఈ సందర్భంగా అత్యంత ప్రగతి కనబరిచిన సింగరంపాలెం ఫీల్డ్ అసిస్టెంట్ బి.ఉమాదేవిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ ఆర్.గంగాభవాని, ఇసి రమేష్, సాంకేతిక సహాయకులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌ను సత్కరిస్తున్న ఎంపిడిఒ నాతి బుజ్జి

ఉపాధి కల్పన కోసం సర్వే

ప్రజాశక్తి - కాజులూరు

వలసలు లేకుండా ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం సచివాలయ సిబ్బందితో సర్వే చేపట్టిందని ఎంపిడిఒ జి,రాంబాబు తెలిపారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాల్లో ఎందరో ఉపాధి లేక ఉంటున్నారని, వారికి స్వగ్రామంలోనే ఉపాధి కల్పించాలనేది ప్రభుత్వ లక్ష్యంగా ఉందన్నారు. హౌస్ హోల్డ్ మ్యాపింగ్‌లో ఉండి 18- 50 సంవత్సరాల మధ్య వయసు వారిని సర్వే ద్వారా గుర్తించి ప్రభుత్వానికి నివేదించనున్నామని అన్నారు. సర్వేలో రిజిస్టర్ అయిన వారికి మాత్రమే ఉపాధి అవకాశాలను కల్పిస్తుందని అన్నారు. స్త్రీ, పురుషులు చదువుకున్నా..లేకపోయినా రిజిస్టర్ చేయించుకోవచ్చనని అన్నారు. అవకాశాలు బట్టి స్థానికంగానే వారికి శిక్షణ ఇచ్చి శిక్షణ అనంతరం ఉపాధి అవకాశాలు ప్రభుత్వం కల్పిస్తుందని తెలిపారు.

15న గొల్లప్రోలు మండల పరిషత్ సమవేశం

ప్రజాశక్తి - గొల్లప్రోలు

ఈ నెల 15వ తేదీ ఉదయం10 గంటలకు గొల్లప్రోలు మండల అధ్యక్షులు అరిగెల అచ్చియమ్మ అధ్యక్షతన మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సాధారణ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ కె.స్వప్న గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ఎంపిటిసిలు, జడ్‌పిటిసి, సర్పంచులుతోపాటు, ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

8న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి - పిఠాపురం

ఈ నెల 8వ తేదీన పట్టణంలోని 12వ అదనపు జిల్లా జడ్జి కోర్టు కాంప్లెక్స్‌లో జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఛైర్మన్ ఎ.వాసంతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విచారణలో ఉన్న కేసులు రాజీమార్గం ద్వారా పరిష్కరించుకునే వీలు కక్షిదారులకు కల్పించబడుతుందన్నారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాజీ పడతగిన సివిల్, క్రిమినల్, చెక్ బౌన్స్, ఎంవిఏపి, కుటుంబ తగాదాలకు సంబంధించిన కేసులను అదాలత్ ద్వారా పరిష్కరించుకోవాలని అన్నారు.

విద్యుత్ భారాలు తగదు

ప్రజాశక్తి - కాకినాడ

గృహ విద్యుత్ వినియోగదారులపై అదనపు లోడ్ భారాలు మోపడం తగదని పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు గురువారం ఓ ప్రకటనలో అన్నారు. వేసవిలో గృహ విద్యుత్ వాడకం అధికంగా ఉంటుందని, దీనిని ఆధారంగా చేసుకుని కిలో వాట్‌కు రూ.1200లు మించితే రూ.2,450, రెండు కిలో వాట్స్ దాటితే రూ.3,650లు అదనంగా వసూలు చేసేందుకు లక్ష్యాలను నిర్దేశించడం దారుణమన్నారు. ట్రాన్స్‌కో ప్రకటించిన 50 శాతం రాయితీ వేసవికి అడ్వాన్స్ క్షవర కళ్యాణంగా ఉందన్నారు. రెండు కిలో వాట్స్ వరకు గృహ వినియోగదారులపై భారాలు లేకుండా రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

పార్టీ బలోపేతానికి కృషి చేద్దాం : గిరిబాబు

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

నియోజకవర్గంలో వైసిపిని బలోపేతం చేసేందుకు కృషి చేద్దామని నియోజకవర్గ వైసిపి కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు అన్నారు. గురువారం ఆయన ప్రత్తిపాడు, ఏలూరు గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రజలు చూస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఏపూరి రామారావు, వైసిపి నాయకులు కొట్టేటి రాయుడు, దాడిశెట్టి చక్రధర్, గుడాల వెంకటరత్నం, తదితరులు పాల్గొన్నారు.

రైతుల నమోదును సమర్థవంతంగా నిర్వహించాలి

ప్రజాశక్తి - జగ్గంపేట

రైతుల విశిష్ట సంఖ్య నమోదు ప్రక్రియను గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులు సమర్థవంతంగా నిర్వహించాలని మండల వ్యవసాయ అధికారి రెడ్ల శ్రీరామ్ ఆదేశించారు. గురువారం స్థానిక రైతు సేవా కేంద్రం-2లో రైతులకు చేస్తున్న విశిష్ట నమోదు ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు వారి భూములుకు సంబంధించి వివరాలు నమోదు చేయించుకోవాలని తెలిపారు. మండలంలో సుమారు 8700 మంది రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని, మిగిలిన రైతులు కూడా త్వరితగతిన రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు.

కార్టూ'నిజం'



బీచ్‌ను అందుబాటులో తీసుకురావాలి

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

ఎన్‌టిఆర్ బీచ్ పరిశీలనలో కలెక్టర్ షాన్‌మోహన్

నగర పరిధిలోని ఎన్‌టిఆర్ బీచ్ సుందరీకరణ పనులు నెల రోజుల్లో పూర్తిచేసి సందర్శకులకు అందుబాటులోకి తీసుకురావాలని కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి ఆదేశించారు. గురువారం రూరల్ మండలం సూర్యాపేట - ఎన్‌టిఆర్ బీచ్‌లో జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. కాకినాడ సముద్ర తీర ప్రాంతంలో ప్రస్తుతం నిర్వహిస్తున్న వివిధ కార్యకలాపాలు, బీచ్ క్లీనింగ్, నూతనంగా చేపట్టబోయే వివిధ అభివృద్ధి కార్యకలాపాల పురోగతిపై ఆయన అధికారులను అడిగి తెలుసుకున్నారు. బీచ్ ప్రదేశాలలో నిర్వహిస్తున్న క్లీనింగ్ పనులు సవ్యంగా లేకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో బీచ్ ప్రాంతానికి వచ్చే సందర్శకులు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఆస్వాదించేందుకు అనువుగా బీచ్ పరిసరాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దడం జరుగుతుందన్నారు. అధికారులు మరింత దృష్టి సారించి నెల రోజుల్లో పనులను పూర్తిచేసి సందర్శకులకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. కాకినాడ బీచ్ పార్క్‌కు వచ్చే సందర్శకులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అధికారులు తగు చర్యలు చేపట్టాలన్నారు. ఈ పర్యటనలో ట్రైనీ ఐపిఎస్ సుస్మిత, నగరపాలక సంస్థ ఎస్ఇ కామేశ్వరరావు, జిల్లా పర్యాటకశాఖ అధికారి పసుపులేటి పోశయ్య, అసిస్టెంట్ టూరిజం అధికారి వి.త్రిమూర్తులు, ఎపిటిడిసి ఎఇ వెంకటేష్, కుడా ఇఇ రామారావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థునులకు అవగాహన కల్పిస్తున్న ఐసిడిఎస్ సిబ్బంది

చట్టాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - కాజులూరు

చట్టాలపై మహిళలు, బాలికలకు అవగాహన అవసరమని ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు కనకరత్నం, మాణిక్యాంబ అన్నారు. గురువారం స్థానిక వినాయక పాఠశాల, గొల్లపాలెం జడ్‌పి పాఠశాలల్లో చట్టాలపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు, బాలికల కోసం అనేక చట్టాలు ఉన్నాయని, అయితే కొందరి వల్ల ఈ చట్టాలు నిర్వీర్యం అవుతున్నాయన్నారు. కావున మహిళలు, బాలికలు చట్టాలపై అవగాహన తెచ్చుకోవాలని సూచించారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్ అంశంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు హనుమావతి, అన్నవరం, సలాది లక్ష్మీ, నాగమణి ప్రసన్న, వరలక్ష్మి, అరుణ పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వివాహిత మృతి

ప్రజాశక్తి - కాజులూరు

మండలంలోని పల్లి పాలెం గ్రామ శివారు కాలా వారి పేటకు చెందిన జిత్తుగ భవాని ఏలూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. స్థానికులు చెప్పిన వివరాలు ప్రకారం...జిత్తుగ అప్పారావు, భవానీ దంపతులు జీవనోపాధి కోసం కొంత కాలం క్రితం హైదరబాద్ వెళ్లారు. భర్త సెక్యూరిటీగా పనిచేస్తూ విద్యుత్తు మరమ్మతులు చేస్తుండగా భార్య పలువురి ఇంటి వద్ద పని చేస్తుందన్నారు. ఈ క్రమంలో బంధువుల వివాహం నిమిత్తం కాకినాడ వస్తుండుగా గురువారం తెల్లవారుజామున ఏలూరు వద్ద ఈమె ఎక్కిన ప్రయివేట్ ట్రావెల్ బస్సు సిమెంట్ లారీని వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో భవానీ మృతి చెందారు. ఈమెకు ఇద్దరు కుమారులు ఉన్నారు. వీరిలో పెద్ద కుమారుడు ఇంజనీరింగ్ చేస్తున్నాడు. చిన్న కుమారుడు ఇంటర్మీడియట్ చదువుతున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

పొగాకు గొడౌన్‌లో మంటలు

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలోని రామేపాలెం గ్రామానికి చెందిన రైతు మైలవరపు పెద్దకాపుకి చెందిన పొగాకు గొడౌన్ ప్రమాదవశాత్తు దగ్ధం అయింది. ఈ ప్రమాదంలో సుమారు రూ.5 లక్షల ఆస్తి నష్టం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. అగ్నిమాపక సిబ్బంది సంఘటన ప్రాంతానికి వచ్చేటప్పటికే పూర్తిగా దగ్ధం అయింది. జరిగిన నష్టానికి ప్రభుత్వం ఆర్థిక సాయాన్ని అందించాలని స్థానికులు కోరారు.

పొగాకు బేరన్ దగ్ధం

ప్రజాశక్తి - గోపాలపురం

ప్రమాదవశాత్తు పొగాకు బేరన్‌లో మంటలు చెలరేగి సుమారు రూ.5 లక్షల నష్టం వాటిల్లిందని జంగారెడ్డిగూడెం ఫైర్ స్టేషన్ అధికారి జి.అబ్రహం తెలిపారు. గురువారం వాదాలకుంటలో గడ కుమారికి చెందిన పొగాకు బ్యారన్ దగ్ధమయ్యింది. స్థానిక రైతులు బేరన్ నిప్పు అంటుకోవడంతో జంగారెడ్డిగూడెం అగ్నిమాపక కేంద్రానికి ఫోన్ చేయడంతో హుటాహుటిన జంగారెడ్డిగూడెం అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలు అదుపు చేశారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

ఉండ్రాజవరం సెక్షన్ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 9:00 గంటల నుంచి మధ్యాహ్నం 12:00 గంటల వరకు విద్యుత్ సరఫరా తాత్కాలికంగా నిలిపివేస్తామని ఎపిఇపిడిసిఎల్ ఇఇ ఎస్.నారాయణ అప్పారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఉండ్రాజవరం, సత్యవాడ, మోర్త, చిలకపాడు, దమ్మెన్ను ప్రజలు సహకరించాల్సిందిగా ఆయన కోరారు.

పొలాలను సందర్శించిన శాస్త్రవేత్తలు

ప్రజాశక్తి - తాళ్లపూడి

మండలంలోని మలకపల్లి పంట పొలాల్లో రైతులు వాడిన పిఆర్ 126 వరి విత్తనంపై వచ్చిన ఫిర్యాదు మేరకు పంటను పరిశీలించినట్టు ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్, శాస్త్రవేత్త డాక్టర్ చల్లా వెంకట నరసింహారావు తెలిపారు. మలకపల్లి పరిసరాల్లో దాళ్వా వరి పంట పరిస్థితి, రకాలు, చీడపీడల ఉధతిని పరిశీలించేందుకు వ్యవసాయ శాఖ శాస్త్రవేత్తలు అధికారులు గురువారం మలకపల్లి గ్రామానికి వచ్చి పంట పొలాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. అనంతరం డాక్టర్ నరసింహారావు మాట్లాడుతూ సేకరించిన నమూనాలను ప్రయోగశాలలో పరీక్షించి నివేదిక సమర్పిస్తామని అన్నారు. దాళ్వా వరి పంట ప్రస్తుతం పాలు పోసుకునే దశ నుండి గింజ గట్టిపడే దశలో ఉందని, అన్నారు. శాస్త్రవేత్తలు డాక్టర్ ఎం.సుధారాణి, డాక్టర్ బి.రోజా, వ్యవసాయ శాఖ కొవ్వూరు ఎడిఎ పి.చంద్రశేఖరరావు, ఎడిఎ ఎస్.జయ రామలక్ష్మి, మండల వ్యవసాయ శాఖ అధికారి రుచిత పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షకు 30 మంది గైర్హాజరు

ప్రజాశక్తి - చాగల్లు, తాళ్లపూడి

చాగల్లు శ్రీవెలగపూడి రామకృష్ణ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలకు 13 మంది విద్యార్థులు పరీక్షలు గైర్హాజరు అయినట్లు కళాశాల ప్రిన్సిపల్ కె.పావని తెలిపారు. 145 మంది విద్యార్థులు పరీక్ష కు హాజరైనట్టు తెలిపారు.

తాళ్లపూడిలో ఇంటర్ పరీక్షలకు 17 మంది విద్యార్థులు గైర్హాజరైనట్టు ఎగ్జామ్ చీఫ్ గౌరీ నాథ్ తెలిపారు. వేగేశ్వరపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో 306 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 289 మంది విద్యార్థులు పరీక్షలు రాశారని చీఫ్ తెలిపారు.

కార్మికులకు రక్షణ పరికరాల పంపిణీ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

నగరపాలక సంస్థలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులు రక్షణ పరికరములు తప్పనిసరిగా వాడాలని కమిషనరు కేతన్ గార్గ్ పేర్కొన్నారు. గురువారం సంస్థ కార్యాలయంలో కార్మికులకు రక్షణ పరికరాలు పంపిణీ చేశారు. సిటిజన్ ఫీడ్ బ్యాక్ బృందాలు ప్రతి రోజు డిగ్రీ కాలేజీలను సందర్శిస్తాయని తెలిపారురు. శానిటరీ సూపర్వైజర్ ఐ.శ్రీనివాస్, రామలింగారెడ్డి, సయ్యద్ ఖాసిం పాల్గొన్నారు.

వెంకన్నకు రూ.4.11 లక్షల ఆదాయం

ప్రజాశక్తి - పెరవలి

అన్నవరప్పాడులోని వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో గురువారం వేలివెన్ను గ్రూపు దేవాలయాల ఇఒ పివి. సుబ్రహ్మణ్యం పర్యవేక్షణలో హుండీలను లెక్కించారు. 43 రోజులకు ప్రధాన హుండీల ద్వారా రూ.4,03,875, అన్నదానం హుండీ ద్వారా రూ.8,104, మొత్తం రూ.4,11,979 ఆదాయం వచ్చిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇఒ ఎం.రాధాకృష్ణ పాల్గొన్నారు.

ఉపాధి సిబ్బంది నిర్లక్ష్యంపై ఆగ్రహం

ప్రజాశక్తి - తుని

ఉపాధి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న డ్వామా పీడీ వెంకటలక్ష్మి.

పర్యావరణ పరిరక్షణ కోసం ఉపాధి హామీ పథకంలో నాటిని మొక్కలను సంరక్షించడంలో విఫలం అయిన ఉపాధి హామీ సిబ్బందిపై డ్వామా పీడీ ఎ.వెంకటలక్ష్మి ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. 2023-24 సంవత్సరంలో గ్రామీణ ఉపాధి పథకంలో జరిగిన అభివృద్ధి పనులపై సామాజిక తనిఖీ ప్రగతి ప్రజావేదిక కార్యక్రమాన్ని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. ఈ ఏడాదిలో 1442 పనులు నిర్వహించగా రూ.14,96,71,010 నిధులను ఖర్చు చేశారు. గ్రామీణ ఉపాధి పథకం ద్వారా చెరువు పనులు పూడికతీతలో పంట కాలువల్లో పూడికతీతలు, ఇతర పనులు నిర్వహించారు. మొక్కలను పెంచడం ద్వారా పర్యావరణ పరిరక్షించాలని లక్ష్యంతో మొక్కల పెంచడానికి అత్యధిక ప్రాధాన్యత ఇచ్చినప్పటికీ మొక్కలను పెంచడంలో ఉపాధి సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల ప్రభుత్వం ఆశించిన రీతిలో వాటిని పెంచకపోవడంపై ఉపాధి సిబ్బంది నిలదీశారు. ఉపాధి కూలీలకు మచ్చులు, సంతకాలు లేకుండానే వేతనాలు చెల్లింపులు జరిగినట్లుగా గుర్తించారు. సామాజిక తనిఖీల్లో బయటపడిన అవకతవకలపై రూ.807 వేలను రికవరీ చేయాలని పీడీ వెంకటలక్ష్మి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎపిడి జగదాంబ, ఎస్ఆర్‌పి సింహాద్రి, డిఆర్‌పి అశోక్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు గుర్తింపు కార్డులను అందిస్తున్న ఎంఎల్ఎ సత్యప్రభ

రూ.30 కోట్లతో అభివృద్ధి పనులు

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

నియోజకవర్గంలో రూ.30 కోట్లతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టినట్లు ఎంఎల్ఎ వరుపుల సత్యప్రభ అన్నారు. గురువారం స్థానిక టిడిపి కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశ:లో ఆమె మాట్లాడారు. నియోజకవర్గంలో 45,000 వేల వరకు సభ్యత్వం నమోదు అయిందన్నారు. సభ్యత్వ కార్డు ఉన్న వ్యక్తికి ప్రమాదవశాత్తు మరణిస్తే బీమా రూపంలో రూ.5 లక్షలను పార్టీ అందజేస్తుందన్నారు. గతంలో రూ.2 లక్షలు ఉన్న బీమాను ప్రస్తుతం రూ.5 లక్షలకు పెంపుదల చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కొమ్ముల కన్నబాబు, అమరాధి వెంకట్రావు, యాళ్ల జగదీష్, పల్లా గోపి, చక్కపల్లి మందీశ్వరరావు పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణలకు నాంది పలకాలి

ప్రజాశక్తి - తాళ్లరేవు

విద్యార్థులకు సర్టిఫికెట్లు అందిస్తున్న జనార్ధనరావు

సాంకేతిక పరిస్థితులను అందిపుచ్చుకుని నూతన ఆవిష్కరణలకు నాంది పలకాలని కోరింగ ఫార్మసీ కళాశాల ఛైర్మన్ దున్న జనార్దన్‌రావు పిలుపునిచ్చారు. గురువారం ఫార్మసీ ఎడ్యుకేషన్ దినోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫార్మసీ రంగంలో నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో కళాశాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఫార్మసీ రంగంలో రిజిస్టర్ అయిన ఫార్మసిస్టులు నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలన్నారు. పిఎం కౌశల్ వికాస్ యోజన పథకంలో లైఫ్ సైన్సెస్ సెక్టార్ స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా శిక్షణ పూర్తి చేసుకుని 100 శాతం ఉత్తీర్ణత సాధించిన రెండు బృందాలకు ధ్రువపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ చిట్టూరి కలికిమూర్తి, మార్కెటింగ్ కమిటీ మాజీ ఛైర్మన్ వుంగరాల వెంకటేశ్వరరావు, ప్రిన్సిపల్ సువర్ణ జ్యోతి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ గోవిందరావు, నైపుణ్య శిక్షకురాలు ఎన్.హేమలత, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కొమ్మూరి రత్నమాల, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యుత్ హైవోల్టేజ్‌తో ఇబ్బందులు

ప్రజాశక్తి - సామర్లకోట



పట్టణ స్టేషన్ సెంటర్ గల అన్న క్యాంటీన్ వద్ద ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు వచ్చిన సాంకేతిక లోపంతో జగ్గమ్మగారి పేట నుంచి మరం సెంటర్ వరకు గురువారం సాయంత్రం నుంచి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. విద్యుత్ హైవోల్టేజ్ కారణంగా గృహాల్లో ఫ్యాన్లు, ట్యూబ్ లైట్‌లు కాలిపోయినట్టు స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. గత 2 రోజులుగా వోల్టేజ్ విషయంలో తేడాలు గమనిస్తున్నామని, అయితే ఈరోజు సాయంత్రం ఒక్కసారిగా హై వోల్టేజ్ వచ్చి గహాల్లోని విద్యుత్ పరికరాలు ధ్వంసం అయ్యాయని ప్రజలు వాపోయారు. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద అమర్చిన ఎర్త్ బ్లేడు లోపం కారణంగా ఈ ఇబ్బంది ఏర్పడిందని, శుక్రవారం సమస్యను పరిష్కరించనున్నట్టు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు.

8న ఫల, పుష్ప ప్రదర్శన

ప్రజాశక్తి - కరప

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఫల, పుష్ప ప్రదర్శనను ఏర్పాటు చేస్తున్నట్లు యంగ్ మైండ్ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు వాకాడ వెంకటరమణ తెలిపారు. గురువారం నడుకుదురు గ్రామంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 8 తేదీన గోడారిగుంట అంబేద్కర్ విగ్రహం వద్ద మహిళలకు, విభిన్న ప్రతిభావంతులైన మహిళా ఉద్యోగినులకు ఫల, పుష్ప ప్రదర్శనను చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళలు పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

సిహెచ్ఓ సునీతకు న్యాయం చేయాలి

ప్రజాశక్తి - పెదపూడి

సునీతకు న్యాయం చేయాలంటూ ధర్నా చేస్తున్న ఉద్యోగులు

మండలంలోని పెద్దాడ పిహెచ్‌సి పరిధిలో విధులు నిర్వహిస్తున్న సిహెచ్ఓ పాలకుర్తి సునీతకు న్యాయం చేయాలని సిహెచ్ఓ అసోసియేషన్ డిమాండ్ చేసింది. గురువారం పెద్దాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అసోసియేషన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ సిహెచ్ఓ సునీతపై వైద్యులు డాక్టర్ సురేఖ, డాక్టర్ ప్రత్యూష, సూపర్‌వైజర్ శారదమ్మ పని ఒత్తిడి పెంచి వేధిస్తున్నారని ఆరోపించారు. ఈ వేధింపులు తాళలేకే ఆమె ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందని అన్నారు. గత ప్రభుత్వం నుంచి ఎంఎల్‌హెచ్‌పిలు పని ఒత్తిడితో విధులు నిర్వర్తిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పలు దఫాలుగా ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులకు వివరించినా ఫలితం లేకుండా పోయిందని అన్నారు. సిహెచ్ఓ సునీత ఆత్మహత్యాయత్నానికి కారకులైన వైద్యులు, సూపర్‌వైజర్‌లను సస్పెండ్ చేయాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో యూనియన్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎపి సిహెచ్ఓ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యాక్షులు మధు, సుధాకర్, ఐ వెంకటేష్, జనరల్ సెక్రెటరీ నరేష్ ఉపేంద్ర రాజ్, రాష్ట్ర కార్యదర్శి సందీప్ తదితరులు పాల్గొన్నారు.

'మహిళలకు రక్షణ కల్పించాలి'

ప్రజాశక్తి - గొల్లప్రోలు

మహిళా దినోత్సవ సభలో మాట్లాడుతున్న నందీశ్వరుడు

పని ప్రదేశంలో మహిళలకు భద్రత కల్పించాల్సిన అవసరం ఉందని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు పద్మావతి అన్నారు. గురువారం స్థానిక మెయిన్ రోడ్‌లో గల ప్రాథమిక పాఠశాలలో సిఐటియు ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. సిఐటియు మండల అధ్యక్షులు ఓరుగంటి నందీశ్వరుడు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నా నేటికీ మహిళలు, బాలికలపై వివక్షత, అత్యాచారాలు, దాడులు జరుగుతూనే ఉన్నాయని అన్నారు. మహిళల రక్షణకు అనేక చట్టాలు ఉన్నా వాటిని అమలు చేయడంలో పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ప్రభుత్వాలు పని ప్రదేశాల్లో మహిళలకు భద్రత కల్పించాలని, మహిళలను ప్రోత్సహించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలు మరింతగా చైతన్యం పొందాలని పిలుపునిచ్చారు. మహిళలు, బాలికలపై జరుగుతున్న దారుణాలను వ్యతిరేకిస్తూ ఉద్యమించాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కె.చిన్న, జెవివి సమత జిల్లా కన్వీనర్ సిహెచ్‌యుఆర్.మంగతాయారు, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి సీతారామరాజు, మండల ప్రధాన కార్యదర్శి ఎం.సత్యనారాయణ, జెవివి మండల గౌరవ అధ్యక్షులు దాడి పద్మనాభం, అంగన్‌వాడీ పిఠాపురం ప్రాజెక్ట్ ప్రధాన కార్యదర్శి తులసిదేవి, వెన్నా వెంకటలక్ష్మి, ఇతర అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

రైతులతో మాట్లాడుతున్న వల్లు రాజబాబు

సాగునీటి కష్టాలపై రైతుల మొర

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని శివారు ప్రాంతాల్లోని పలువురు రైతులు సాగునీటి కష్టాలపై ఎపి కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వల్లు రాజబాబు వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం సాగునీరు అందని శివారు ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు పి.మల్లవరం పంచాయతీ గ్రాంటు ప్రాంతంలోని 9వ నెంబరు పైపు చిన్న తూరతిప్ప, 11 నెంబరు పెదమాడి కాపు పైపులైను పైన, మెయిన్ కాలువ, కొత్త కాలువ, చిన్న డాక్టర్ కాలువ, ఎంఎస్ఎన్ చార్టీస్ తదితర ప్రాంతాల్లో మొత్తం 670 ఎకరాలకు సాగునీరు పూర్తిగా అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు గంజా శ్రీను, పితాని సత్యనారాయణ, మేడిశెట్టి సత్యనారాయణ, గెద్దాడ భగవాన్, వాసంశెట్టి రాము, దొమ్మేటి శివకుమార్, వెంకటేశ్వర రావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

8 నుంచి పి4 సర్వే ప్రారంభం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండల పరిధిలోని 23 గ్రామాల్లో ఈనెల 8వ తేదీ నుంచి పి-4 సర్వేను ప్రారంభించనున్నట్లు ఎంపిడిఒ డి.శ్రీలలిత తెలిపారు. గురువారం ఆమె మీడియాతో మాట్లాడారు. ప్రతి గ్రామంలో ఇంటింటి సర్వే నిర్వహించి ఆ ఇంటిలో నివసిస్తున్న వారి మౌలిక వసతులు, ఆర్థిక ప్రమాణాలు, పేదరికం గుర్తిస్తారన్నారు. గుర్తించిన 20 శాతం పేద కుటుంబాలను వారి ఆర్థిక, సామాజిక, స్థితిగతులు ఏడాదికి 15 శాతం పెంచేందుకు ఈ సర్వే నిర్వహించబడుతుందన్నారు. ఈ సర్వే నిర్వహించేందుకు 27 రకాల ప్రశ్నలతో గ్రామ సచివాలయాల ద్వారా సర్వే నిర్వహిస్తామని చెప్పారు. సర్వేకు వచ్చే సచివాలయ సిబ్బందికి ప్రజలందరూ సహకరించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

ఉపాధి పనుల పరిశీలన

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలోని కె.గోపాలపురం గ్రామంలో గురువారం చేపట్టిన ఉపాధి పనులను డ్వామా పీడీ వెంకటలక్ష్మి పరిశీలించారు. లబ్ధిదారు పందిరి మంగ పొలంలో చేపడుతున్న ఫారం పాండు పనులను పరిశీలించి, గట్టుపై కూరగాయల మొక్కలు పెంచకోవాలని సూచించారు. రైతులు అధిక మొత్తంలో ఫారం పాండ్లు, ట్రెంచ్ వర్కులు, హార్టికల్చర్ వర్కులు ప్రతిపాదించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ ఆర్.గంగాభవాని, ఇసి పి.రమేష్, సహాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రయోగాలపై అవగాహన

ప్రజాశక్తి - పెద్దాపురం


ప్రయోగాలు చేస్తున్న విద్యార్థినులు

స్థానిక ఎసిటి సైన్స్ సెంటర్లో గురువారం ప్రతిభ విద్యా నికేతన్ 9వ తరగతి విద్యార్థులకు, వైఆర్ఎల్ఐటి కాన్సెప్ట్ స్కూల్ 9 వ తరగతి విద్యార్థులకు ప్రయోగాలపై అవగాహన కల్పించారు. సైన్స్ సెంటర్ నిర్వాహకులు బుద్ధా శ్రీనివాస్ ఆధ్వర్యంలో భౌతిక శాస్త్రంలో రసాయన సమీకరణాల చర్యలు పాఠ్యాంశానికి సంబంధించి విద్యార్థులతో అనేక ప్రయోగాలు చేయించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఆర్‌పి ప్రసాద్, ల్యాబ్ అసిస్టెంట్ సునీత పాల్గొన్నారు.

ఐసిడిఎస్ ఆధ్వర్యాన ఆటల పోటీలు

ప్రజాశక్తి - పెద్దాపురం

కుర్చీ ఆట ఆడుతున్న మహిళలు

స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలకు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గురువారం ఆటల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను సిడిపిఒ జి.ఉష ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విజేతలందరికీ ఈనెల 8వ తేదీన ఐసిడిఎస్ ప్రాజెక్టు వద్ద జరిగే అంతర్జాతీయ మహిళా దినోత్సవ సభలో బహుమతులు అందజేస్తామన్నారు. 7వ తేదీన 2కె రన్ నిర్వహిస్తామన్నారు.

పట్టాలు మంజూరు చేయాలని వినతి

ప్రజాశక్తి - గోకవరం

మండలంలోని కామరాజుపేట పంచాయతీ పరిధి శివరామ్‌పట్నంలో సుమారు 36 ఎకరాల భూమిని భూమి లేని నిరుపేదలు 20 ఏళ్ల నుండి సాగు చేసుకుంటున్నారు. ఆ భూములకు పట్టాలు మంజూరు చేయాలని గురువారం తహశీల్దారు సాయి ప్రసాద్‌కు ఎపి రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రంతో పాటు సాగుదారుల పేర్లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ భూమి కోసం గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అనేక ర్యాలీలు, రాస్తారోకోలు, నిరసనలు నిర్వహించామని తెలిపారు. అదే క్రమంలో అక్రమ కేసులు, నిర్బంధాలు భరించామని తెలిపారు. అయినా గాని ఎన్ని ప్రభుత్వాలు మారిన సాగు చేసుకుంటున్నా నిరుపేదలకు పట్టాలు మంజూరు చేయడం లేదని తెలిపారు. సాగుదారులకి పట్టాలు మంజూరు చేస్తే వారు ఆర్థికంగా బలపడడానికి తోడ్పడినట్టు అవుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎపి రైతు కూలీ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కె.సతీష్, నాయకులు కర్ణాకుల రామలింగేశ్వరరావు, దేసెట్టి సురేష్, జాన్, అర్జున్ పాల్గొన్నారు.

యానాం వార్తలు

కనీస వేతనం అమలు చేయాలి

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి లేబర్ యాక్ట్ ప్రకారం ప్రభుత్వ అమలు చేయవలసిన కనీస వేతనం తక్షణమే అమలు చేయాలని యానాం మిల్క్ బాయిలర్స్ అసోసియేషన్ సభ్యులు డిమాండ్ చేశారు. స్థానిక జండా స్తంభం వద్ద జరుగుతున్న మిల్క్ బాయిలర్ ఆందోళన గురువారం నాటికి మూడో రోజుకు చేరింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు అర్ధాని దినేష్, కాటంశెట్టి రామమ్మూర్తి తదితరులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుమారు 23 సంవత్సరాల నుంచి వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో మిల్క్ బాయిలర్‌గా పనిచేస్తున్న వందలాదిమంది సిబ్బందికి రూ.10వేలు నుంచి రూ.18వేలు వేతనం పెంచుతానని ముఖ్యమంత్రి రంగస్వామి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. తక్షణమే జిఒను విడుదల చేసి మిల్క్ బాయిలర్స్‌కు న్యాయం చేయాలని కోరారు.

కె.జంక్షన్‌కు వెంకన్న రథం తరలింపు

ప్రజాశక్తి - యానాం

యానాం వెంకటేశ్వరస్వామి కళ్యాణ మహోత్సవాలు సందర్భంగా స్థానిక బస్టాండ్ ఆవరణలోని రథం షెడ్ నుంచి రథంను స్థానిక కె.జంక్షన్ సెంటర్‌కు తరలించారు. ఉత్సవదారులు, పోలీసులు ఆధ్వర్యంలో రథంను స్వామి వారి ఆలయం సమీపంలోని కె.జెంక్షన్ కు ట్రాక్టర్ సహాయంతో తరలించారు. ఈ నెల 13న స్వామివారి రథోత్సవం జరగనుంది.

అక్రమ మోటార్లను తొలగిస్తున్న అధికారులు

మోటార్లతో సాగు నీరు తోడితే చర్యలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

శివారు పంట పొలాలకు సాగునీరు అందకుండా అక్రమ పైపులు, మోటార్లు ద్వారా సాగునీరు తరలించే వారిపై చర్యలు తప్పవని ఆర్‌డిఒ ఎస్. మల్లిబాబు హెచ్చరించారు. ఇటీవల అక్రమంగా నీరు తరలిస్తున్న పైపులను తొలగిస్తున్న సందర్భంగా ఇరిగేషన్ అధికారులపై కొందరు రైతులు దురుసుగా ప్రవర్తించారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాలతో గురువారం మత్స్యశాఖ అధికారి కరుణాకర్, వ్యవసాయ శాఖ జిల్లా అధికారులతో కలిసి ఆయన నీలపల్లి, పి.మల్లవరం పంట కాలువలను పరిశీలించారు. డివైడింగ్ డామ్ పరిధిలో అక్రమంగా ఏర్పాటు చేసిన 12 పైపులను అధికారులు తొలగించారు. శివారు ప్రాంతాల్లో రైతులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూడాల్సిన బాధ్యత అందరిపైన ఉందని ఆర్‌డిఒ అన్నారు. వంతుల వారీ పద్ధతిలో దిగువకు నీరు వెళ్లేలా పైన రైతులు సహకరించాలన్నారు. అక్రమంగా ఎటువంటి పైపులు వేసిన వాటిని తొలగించి కేసులు పెట్టడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ పి.త్రినాధరావు, సిఐ చైతన్యకృష్ణ, ఇరిగేషన్ ఎఇ అనూష, డిసి ఛైర్మన్ వేగేశ్న భాస్కరరాజు, నీటి సంఘాల అధ్యక్షులు అల్లూరి రామకృష్ణంరాజు, ఉంగరాల గోపి, కోరంగి ఎస్ఐ పి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - సామర్లకోట

మండలంలోని వెట్లపాలెం, పెద్దాపురం మండలం ఆర్‌బి.పట్టణం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు రూరల్ గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం వాటిల్లుతున్నట్టు ఎపిఇపిడిసిఎల్ ఇఇ ఎవిఎన్‌డిఎస్ ప్రభాకర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. వేట్లపాలెం రైల్వే ఏరియా, హుస్సేన్‌పురం రూరల్ ఫీడర్స్, వ్యవసాయ ఏరియా, ఆర్‌బి.పట్నం ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం కలుగుతుందన్నారు. ఈ అంతరాయానికి విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

త్వరితగతిన పన్నులు వసూలు చేయాలి

ప్రజాశక్తి - కిర్లంపూడి

మండలంలో దీర్ఘకాలికంగా బకాయపడిన పన్నులను త్వరితగతిన వసూలు చేయాలని డిఎల్‌పిఒ బాలమణి అధికారులను ఆదేశించారు. గురువారం జగపతినగరం, ముక్కొల్లు గ్రామాల్లోని చెత్త నుంచి సంపద కేంద్రాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి రోజు గ్రామాలలో ఇంటింటా తడి, పొడి చెత్త సేకరణను విధిగా చేపట్టాలని అన్నారు. ఆ చెత్తను చెత్త నుంచి సంపద కేంద్రాలకు తరలించాలన్నారు. దానిని ఎరువుగా తయారుచేసి రైతులకు అందించేందుకు సిద్ధం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ఎన్‌టిఆర్.రమేష్‌బాబు, కె.సరళాదేవి పాల్గొన్నారు.

ఫిల్టర్ బెడ్ చెరువులో చేపల వేట

ప్రజాశక్తి - సామర్లకోట

చేపల విక్రయాలు చేస్తున్న వ్యాపారులు

పట్టణ ప్రజలకు తాగునీరందించే ఫిల్టర్ బెడ్ చెరువులో చేపల వేట గురువారం ప్రారంభం అయింది. దీనిపై మానవహక్కుల సంఘం జిల్లా అధ్యక్షులు నూతలపాటి అప్పలకొండ మాట్లాడుతూ ఇప్పటికే కుళాయి చెరువులో జలాలు ఇంకిపోయి ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. చేపల వేట వల్ల జలాలు కలుషితమై పోతాయన్నారు. దీనిపై జిల్లా ఉన్నతాధికారులు స్పందించాలని కోరారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఫిల్టర్ బెడ్ చెరువులో కొత్తగా గోదావరి జలాలు నింపేందుకు వీలుగా ఏడాది చెరువును ఎండ కడుతున్నట్టు మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య చెప్పారు. ఫిల్టర్ బెడ్ చెరువులో ఇకపై చేపల పెంపకాన్ని నిషేధిస్తూ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

మహారాజశ్రీ 2వ అదనపు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు : కాకినాడ
E.A.No. 193/2024, E.P.No. 34/2024, O.S.No. 556/2010
Between:
వల్లూరి జగన్నాయకులు ...పిటీషనర్/Dhr
మరియు
వాసంశెట్టి అప్పారావు, వగైరాలు
...రెస్పాండెంట్లు/JDR's
R_1 : వాసంశెట్టి అప్పారావు, S/o. అప్పారావు, డో.నెం.3-17-44,సింహాద్రి అపార్టుమెంట్స్, ఫస్ట్ ఫ్లోర్, రాధానగర్, అంబేద్కర్ గారి విగ్రహం ప్రక్కన, గొడారిగుంట,కాకినాడ.
R_2 : వాసంశెట్టి మహాలక్ష్మి, W/o. అప్పారావు, డో.నెం.3-17-44,సింహాద్రి అపార్టుమెంట్స్, ఫస్ట్ ఫ్లోర్, రాధానగర్, అంబేద్కర్ గారి విగ్రహం ప్రక్కన, గొడారిగుంట,కాకినాడ.
పై నెంబర్ ఎగ్జికుటివ్ అప్లికేషన్ E.A. No. 193/2024 లో మీరు 1 మరియు 2 రెస్పాండెంట్లు అయ్యివున్నారు. శ్రీ కోర్టు వారి నుండి మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపినను తీసుకోకుండా కాలయాపన చేయుచున్నారు. పై నెంబర్ E.A. No. 193/2024 పిటీషన్ ది. 25-3-2025 సం॥తేదిన వాయిదా అయ్యివున్నది. కావున పైన తెలిపిన కోర్టులో హాజరయ్యి ఆక్షేపణలు తెలియపరచుకోవలెను. లేని యెడల పై నెంబర్ పిటీషన్ తమ పరోక్షమున తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియపరచటమైనది.
|| By Court Order ||
కాకర వెంకటేశ్వరరావు, అడ్వకేట్
#12-1-40, జవహర్ వీధి, కాకినాడ.
Ph: 0884-2367506, Cell: 9848314081

పబ్లిక్ నోటీసు
నా క్లయింటు తూర్పుగోదావరి జిల్లా, రాజమహేంద్రవరం, గాదాలమ్మ నగర్, డోర్ నెం. 88-3-5 కాపురస్తురాలు C.Radha Agrotech Private Limited, Managing Director అయిన చింతలపాటి వెంకట సత్య సూర్య రఘురామరాజు గారి భార్య చింతలపాటి రాధ గారు ఇచ్చిన సంజాయిషీపై యావన్మంది ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా,
నా క్లయింటు తన స్వాధీనములో గల ఈ దిగువ ఉదహరించిన దస్తావేజులు తన దగ్గర ఉద్యోగం చేస్తున్న గొట్టుముక్కల సురేష్ కుమార్ రాజు గారికి ఇచ్చి జిరాక్స్ కాపీలు తీయించమని అప్పగించగా, అవి పెద్దాపురం మెయిన్‌రోడ్‌లో గల జిరాక్స్ షాపులో జిరాక్స్ కాపీలు తీయించుకొని వస్తుండగా ఒరిజినల్ దస్తావేజులు పడిపోయినవి. సదరు దస్తావేజులు ఎవరికైన దొరికిన ఎడల నాకు గాని, నా క్లయింటుకు గాని అప్పగించవలసినదిగా కోరుచున్నాను.
దస్తావేజు వివరములు:
1. ది. 01-12-2011 సం॥ తేదీన రాజమండ్రి శ్యామలానగర్ కాపురస్తులు బిక్కిన వీరాస్వామి, బిక్కిన ఉషారాణి నా క్లయింటు చింతలపాటి రాధ గారికి తూర్పుగోదావరి జిల్లా, రాజమండ్రి మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా, డోర్ నెం. 88-3-5 కు సమీపంలో గల R.S. No. 365, 366, 367 లో గల ఫ్లాట్ నెంబరులు 29, 30 కు సంబంధించి వ్రాసిన రాజమండ్రి సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్ క్రియ దస్తావేజు నెం. 7034/2011.
2. ది. 23-5-1985 సం॥ తేదీన పై ఉదహరించిన ఆస్తికి సంబంధించి బిక్కిన వీరాస్వామి వగైరాలకు అంగిటిపల్లి సీతారామ రెడ్డి గారు రాజమండ్రి సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్‌లో దస్తావేజు నెం. 4774/1985 గా వ్రాసి ఇచ్చిన క్రియ దస్తావేజు.
వేదుల సుబ్రహ్మణ్యం, అడ్వకేట్
పెద్దాపురం, సెల్: 9052699989